# గెలుపు

*ఆంధ్రభూమి వీక్లీ. 16 జనవరి, 2003*



"హాయ్ రమ్యా..! ఇక్కడ..."

ట్రైను దిగి స్నేహితురాలి కోసం ఎదురుచూస్తున్న రమ్య– సింధు గొంతు విని, తలతిప్పి చూసింది. ఆమెని రిసీవ్ చేసుకోవడానికి సింధు తన భర్తతో వస్తూ కనిపించింది.

"అబ్బ... ఎన్నాళ్లయిందే నిన్ను చూసి?!" సింధు చేతులు పట్టుకుంటూ ఆప్యాయంగా అంది రమ్య.

"అవును! రెండేళ్లు అయింది. రమ్యా..! ఈయన మా శ్రీవారు.. రోహిత్!" అంటూ భర్తను పరిచయం చేసింది.

'చాలా అందంగా ఉన్నాడు రోహిత్. సింధు అదృష్టవంతురాలు!' మనసులోనే అనుకుంది రమ్య.

"రండి. ఇంటికెళదాం!" రోహిత్ అన్నాడు- ఆమె సూట్‌కేస్ అందుకుంటూ.

రమ్యని కారులో తమ ఇంటికి తీసుకెళ్లారు రోహిత్ దంపతులు. ఇంట్లో కాసేపు కూర్చున్నాక రోహిత్ ఆఫీసుకి బయలుదేరాడు.

"నేను ఆఫీసుకి వెళ్లొస్తానండి! మళ్లీ సాయంత్రం వస్తాను. హేవ్ ఎ నైస్‌టైమ్ విత్ యువర్ ఫ్రెండ్!" అని రమ్యతో చెప్పి వెళ్లిపోయాడు.

"ఆం... ఇప్పుడు చెప్పు సంగతులు! ఎలా వుంది నీ కొత్తకాపురం? మీ ఆయన నిన్ను బాగా చూసుకుంటున్నట్లే ఉంది!" రమ్య అంది.

"అవును. ఆయనకి నేనంటే చాలా ఇష్టం!"

"ఎంతైనా కొత్తపెళ్ళాం కదా... ఆ ప్రేమ, ఇష్టం కొద్దిరోజులుంటాయి!"

"కొన్నిరోజులేం ఖర్మ?! ఎన్నేళ్లైనా అలాగే ఉంటాయి. రమ్యా... ఒక మనిషిని చదవడానికి పదిరోజులు చాలు! ఆయనని రెండేళ్లుగా చూస్తున్నాను కదా... ఆయన ప్రేమ మీద, అనురాగం మీద నాకు పూర్తిగా నమ్మకం ఉంది!" దృఢంగా అంది సింధు.

"నీకు ఆ నమ్మకం ఉంటే మంచిదే! నీకంటే అందమైన అమ్మాయి కనిపించి, కవ్విస్తే ఆ ప్రేమా, అనురాగం మాయమయిపోతాయేమోనని నా భయం! అసలే అందగాడు. ఆపై యువకుడు, ధనవంతుడు కూడాను. యునో... ఇంటెగ్రిటీ ఈజ్ లాక్ ఆఫ్ ఆపర్చ్యునిటీ!"

"ఓ.కే.! నీవు నాకంటే అందగత్తెవే కదా... అదేదో నీవే ప్రయత్నించు! ఆయన ప్రేమలోని నిజాయితీ తెలిసిపోతుంది!" కోపంగా అంది సింధు.

"ఛ... ఛ! నేను నీతో నాలుగురోజులు సరదాగా గడపాలని వచ్చానే తప్ప- నీ భర్తను నీనుంచి లాక్కోవడానికి కాదు!" అంది రమ్య.

"నువ్వు లాక్కున్నా ఆయన నీమీద పడరు. వాదన అంటూ వచ్చింది కాబట్టి- ఎవరో ఒకరు గెలవాలి. నా వాదన నిజమని ఒప్పుకో... లేదా, నీ వాదన నిజమని నిరూపించు!"

"అలాగే..! మీ ఆయనా చాలామంది లాంటి మగాడే అని నిరూపిస్తాను. అయితే దీనివల్ల మన స్నేహం చెడుతుందేమోనని నాకు భయంగా ఉంది!" అంది రమ్య.

"మన స్నేహమూ చెడదు, మా కాపురం కూడా చెడదు. చెప్పాగా... నాకు ఆయనపై చాలా నమ్మకం అని!" అంది సింధు.

"సరే... ఇక ఆ పనిమీదే ఉంటాను!"

తర్వాత ఆ విషయం మరచిపోయి ఆనందంగా కబుర్లు చెప్పుకున్నారు స్నేహితురాళ్ళిద్దరూ. మధ్యాహ్నం కాసేపు నిద్రపోయి లేచారు.

"సింధూ..! మీవారికి ఫోన్‌చేసి నీవు సరుకుల కోసం బయటికి వెళ్తున్నాననీ, ఆరుగంటలకి ఇంటికి తిరిగివస్తాననీ, ప్రయాణపు బడలికవల్ల నేను ఇంట్లోనే ఉంటాననీ చెప్పు. నువ్వు ఓ గంటసేపు బయట తిరిగిరా!" కాఫీ త్రాగుతూ అంది రమ్య.

"ఎందుకు?"

"మరి... నేను గెలవాలంటే నా ప్లానులేవో నేను వెయ్యాలి కదా!"

సింధు ముఖంలో అనుమానం కనిపించి, "నేను మీవారి పాతివ్రత్యానికి భంగం కలిగించే ప్లానులేవీ వెయ్యనులే... భయపడకు!" అంది రమ్య నవ్వుతూ.

"ఛ... ఛ! అదికాదు. ఇవన్నీ ఆయనకి తెలిస్తే కోపం వస్తుందేమోనని నా భయం!"

"ఆయనకి తెలిసే అవకాశమే లేదు. మనిద్దరం చెప్పకపోతే ఆయనకెలా తెలుస్తుంది?" సింధుకి ధైర్యం చెప్తూ అంది.

"సరే... జాగ్రత్త! మరీ ఓవర్‌యాక్షన్ చెయ్యకు!" అంటూ సింధు భర్తకి ఫోన్ చేయసాగింది.

సింధు బయటకి వెళ్లాక- రమ్య సింధు బీరువా తెరిచి ఆమె చీర ఒకటి ఎన్నుకొని, తను ధరించింది. అందంగా మేకప్ చేసుకుని, ఫ్రిజ్‌లోని పూలు తలనిండా ధరించి రోహిత్ కోసం ఎదురుచూడసాగింది.

రోహిత్ కారు పార్కుచేసి వస్తూంటే... హాల్లో వెనక్కితిరిగి అల్మరా సర్దుతున్నట్టు నటించసాగింది. ఆమె ఊహ ప్రకారం రోహిత్ రమ్యని వెనుకనుంచి కౌగలించుకుంటాడు. ఆమె ముఖం చూడకుండా ఉండటానికే ప్రయత్నించి వీలైనంతసేపు తన కౌగిలిలో బంధిస్తాడు. ఆ తర్వాత రమ్య ముఖాన్ని చూసి, 'అరెఁ... సింధు చీరలో ఉంటే తనే అనుకున్నాను. తప్పయిపోయింది- ఏమనుకోకండీ..!' అని బ్రతిమలాడతాడు. సింధు ఇంట్లో లేదని తెలిసీ అలా ప్రవర్తించాడు కనుక- సింధు ఓడిపోయినట్లూ, తను గెలిచినట్లూ అవుతుంది.

- ఆ ఉద్దేశంతోనే అతనికి ముఖం కనిపించకుండా అటుతిరిగి నిలుచుంది. ఎత్తులో రమ్య, సింధు దాదాపు ఒకేలా వుంటారు.

రోహిత్ లోపలికి రాగానే సోఫాలో కూర్చుని, షూస్ విప్పుతూ... "సింధు ఇంకా రాలేదా?" అని అడిగాడు.

"ఇంకా రాలేదు. ఈపాటికి వచ్చేస్తూ ఉంటుంది!" అంది రమ్య.

"మీరు రెడీగానే ఉన్నారు కదా! నేనూ రెడీ అయి వస్తాను. సింధు రాగానే బిర్లామందిరం వెళ్లొద్దాం!" అంటూ లోపలికి వెళ్లిపోయాడు.

సింధు రాగానే "ఏమైంది నీ ప్లాను?" అని అడిగింది ఆతృతగా.

"ఫ్లాప్! అవునూఁ... నా ప్లాను కూడా ఫోనులో చెప్పేశావా ఏమిటి?" అనుమానంగా అడిగింది రమ్య.

"అసలు నీ ప్లానేంటో నాకు తెలిస్తే కదా... ఆయనకు చెప్పడానికి? నీకు నామీద నమ్మకం లేకపోతే వదిలేద్దాం!" నిష్ఠూరంగా అంది సింధు.

"లేదులే... ఊరికే అడిగాను- చనువు కొద్దీ!"

మరుసటిరోజు సినిమాకి టికెట్లు తెమ్మంది సింధు భర్తతో!

- తీరా బయల్దేరేముందు తనకి కడుపునొప్పిగా ఉందని, వాళ్ళిద్దరినీ వెళ్లిరమ్మని చెప్పింది సింధు.

"పోనీ... టికెట్లు కాన్సిల్ చేద్దాం!" అన్నాడు రోహిత్.

"వద్దండీ..! రమ్యకు సినిమాపిచ్చి ఎక్కువ. మీరిద్దరూ వెళ్లిరండి!" అంది సింధు.

"సిల్లీగా మాట్లాడకు! నువ్వు ఇక్కడ కడుపునొప్పితో బాధపడుతూంటే- అక్కడ నేను సినిమా ఎలా చూడగలననుకున్నావ్?" చిరుకోపంతో అన్నాడు రోహిత్.

"నొప్పి ఎక్కువగా ఉంటే నేనుమాత్రం మిమ్మల్ని పంపుతానా? ప్లీజ్... మీరు వెళ్లిరండి. లేకుంటే అది డిసప్పాయింట్ అవుతుంది!" అభ్యర్థిస్తూ అంది సింధు.

ఇంటర్వెల్‌లో ఇద్దరూ బయటకి వచ్చారు. రోహిత్ కూల్‌డ్రింక్స్ తెచ్చి ఆమెకొకటిచ్చి తనొకటి తీసుకున్నాడు.

"సింధు మిమ్మల్ని చేసుకున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. సింధు నిజంగా అదృష్టవంతురాలు. మీరు సింధుకంటే ముందు నాకు పరిచయమయివుంటే నేను మిమ్మల్ని వదిలేదాన్ని కాను!" కూల్‌డ్రింక్ తాగుతూ అంది రమ్య.

"మేరేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్..!" అన్నాడు రోహిత్ సింపుల్‌గా.

"అఫ్‌కోర్స్... కానీ, మానవప్రయత్నం కూడా ఉండాలిగా! ఐ ఎన్వీ సింధు!" అతని కళ్ళల్లోకే చూస్తూ అంది.

"యూ నీడ్ నాట్ బీ అన్‌హేపీ! మీకోసం కూడా ఓ అందమైన యువకుడు, చదువుకున్నవాడు, మంచి ఉద్యోగం ఉన్నవాడు, తన కోరికల్ని, ఆశల్ని మీకోసమే దాచుకొని తన జీవితంలో మీ రాక కోసం ఎక్కడో ఒకచోట ఎదురుచూస్తూ ఉండిఉంటాడు!"

తొమ్మిది గంటలకు సినిమా పూర్తయింది.

కారు ఇంటి దగ్గర ఆపగానే పనిమనిషి రోహిత్ దగ్గరికి వచ్చి, "అమ్మగారు పెద్దయ్యగారింటికి వెళ్లారు. పది గంటలకు వచ్చేస్తానన్నారు. మిమ్మల్నిద్దరినీ భోంచేసేయమన్నారు!" అంటూ ఇంటి తాళంచెవి అతనికిచ్చింది.

"సింధుకి కడుపునొప్పి ఎలా వుంది?" ఆదుర్దాగా అడిగాడు.

"తగ్గిపోయిందంట! నేను వెళ్లొస్తాను!" అంటూ ఆమె వెళ్లిపోయింది.

రోహిత్, రమ్య కబుర్లు చెప్పుకుంటూ భోంచేశారు.

రోహిత్‌కి ఎదురుగా కూర్చుంది రమ్య. వద్దంటున్నా వినకుండా అతనికి పెరుగు వెయ్యడానికి ముందుకువంగింది రమ్య.

రెండుచేతులను తన పళ్ళేనికి అడ్డంగా పెట్టాడు రోహిత్.

అతని చేతుల్ని తప్పించి వడ్డించడానికి మరింత ముందుకు వంగింది.

ఆ కదలికకు ఆమె పైట క్రింద పడిపోయింది...

– ఒక చేతిలో పెరుగు గిన్నె ఉంది. మరో చేయి ఎంగిలి చేయి! ఏం చేయాలో తోచనట్లు నిలబడిపోయింది.

ఎదురుగా కనిపిస్తున్న దృశ్యం చూసి నిశ్చేష్టుడయ్యాడు రోహిత్. ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసలు స్పష్టంగా కనబడుతున్నాయి అతనికి.

ముందుగా అతడే తేరుకుని, "ఆ పెరుగు గిన్నె క్రింద పెట్టండి!" అన్నాడు.

వెంటనే గిన్నె క్రింద పెట్టి, పైట నిండుగా కప్పుకుంది రమ్య.

రోహిత్ చేతులు కడుక్కుని తన బెడ్‌రూంలో కెళ్లి, మంచంమీద కూర్చుని కార్డ్‌లెస్ అందుకుని సింధుకి ఫోన్ చేశాడు.

"ఇదిగో... నేను ఇప్పుడే బయలుదేరుతున్నాను. ఇంకో అరగంటలో అక్కడుంటాను!" అంటూ ఫోన్ పెట్టేసింది సింధు.

"ఎవరికి ఫోన్?"

తలెత్తి చూశాడు రోహిత్.

తలుపు దగ్గర రమ్య నిలబడివుంది. నైటీ ధరించి ఉండడంవల్ల ఆమె అందాలు మరింత స్పష్టంగా కనిపించసాగాయి.

"సింధు ఇప్పుడే బయలుదేరుతోందట..!"

అతని ఎదురుగా కూర్చుని తనలో తాను నవ్వుకోసాగింది.

"ఎందుకలా నవ్వుకుంటున్నారు?"

"మిమ్మల్ని మీరు నగ్నంగా ఎప్పుడైనా చూసుకున్నారా?"

అదిరిపడ్డాడు ఆ ప్రశ్నకి!

నవ్వుతూ అతని జవాబుకోసం ఎదురుచూస్తోంది రమ్య.

"చెప్పండి!"

'లేద'న్నట్టు తలాడించాడు.

"నేను చూశాను!"

సిగ్గు ముంచుకొచ్చిందతనికి.

"ఎప్పుడు? ఎక్కడ?" ఎలాగో గొంతు పెగల్చుకుని అన్నాడు.

"ఇక్కడ..." అంటూ తన చేతిలోని ఫోటో అతనికి చూపించింది.

లేచి ఆత్రంగా ఆమెవైపు వచ్చాడు.

ఆమె లేచి మంచం చుట్టూ అతన్నుంచి తప్పించుకుని తిరుగుతూ అలాగే మంచంపై ఒరిగిపోయింది.

బలవంతంగా ఆమె చేతిలోని ఫోటోని తీసుకుని చూశాక- అతని మనసు శాంతించింది. అది అతనికి రెండేళ్ల వయస్సున్నప్పుడు తీసిన ఫోటో!

ఇంతలో... రమ్య చేతులు రెండూ తనచుట్టూ బిగుసుకుపోవడం గ్రహించి- తనూ ఆమెచుట్టూ చేతులు వేసి గట్టిగా కౌగిలించుకున్నాడు.

ఆమె విడిపించుకోబోయింది.

అతడు వదల్లేదు.

అయిదు నిముషాలు అలా అతని కౌగిలిలో ఉండిపోయింది.

ఇంతలో... కాలింగ్‌బెల్ మ్రోగడంతో- రోహిత్ చటుక్కున లేచి ఆమెవైపు చూసి, తలుపు తీయడానికి వెళ్లాడు.

రమ్య గబగబా ప్రక్కగదిలోకి వెళ్లింది.

• • •

పడుకోబోయేముందు రమ్య గదికి వచ్చింది సింధు.

"ఏమైంది నీ ప్లాన్?"

"సూపర్‌హిట్..!" గర్వంగా చెప్పింది రమ్య.

"నేను నమ్మను!"

"నేను నిన్ను నమ్మాను!" అంది రమ్య.

"సారీ... ఏం జరిగిందో చెప్పు!" ఆతృతగా అడిగింది సింధు.

జరిగింది చెప్పింది రమ్య.

సింధు కళ్ళనిండా నీళ్లు నిండాయి. స్నేహితురాలి ముందు ఓడిపోయినందుకు అవమానం, భర్త ప్రవర్తన గురించి బాధ, ఏడుపు ఆమెని చుట్టుముట్టాయి.

"సారీ సింధూ..! అనవసరంగా మనం ప్రాబ్లెమ్స్ కొనితెచ్చుకున్నాం. అయినా నేను రెచ్చగొట్టడం వల్లే మీ ఆయన అలా ప్రవర్తించారు. ఇందులో ఆయన తప్పేమీ లేదు."

రమ్య ఊరికెళ్లాక సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికి రాగానే సింధు ప్రక్కన చేరాడు రోహిత్.

"అబ్బ... ఎన్నాళ్లకి నా కాంతతో ఏకాంతం దొరికింది నాకు..?"

"ఏకాంతానికి ఏ కాంతైతే ఏం? భార్యే... కావాలని లేదుగా?!"

"ఏ కాంతైతే ఏం... అనుకునే రకం కాను నేను. నా కాంతే నాకిష్టం!" ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంటూ అన్నాడు.

"ఎందుకండీ ఈ నటనలు? రమ్య నాకంతా చెప్పింది. మీకు నేనంటే చాలా ఇష్టమనీ, మరే ఆడపిల్ల రెచ్చగొట్టినా లొంగరని దానితో గర్వంగా చెప్పాను. అది నా గర్వాన్ని అణచి, మీమీద మనసు విరిగిపోయే నిజం చెప్పి వెళ్లిపోయింది!" వెక్కివెక్కి ఏడవసాగింది సింధు.

"పిచ్చి సింధూ! నీవు ఓడిపోలేదు... గెలిచావు!" ఆమె భుజంమీద చేయి వేసి అనునయిస్తూ అన్నాడు.

"గెలిచానా... ఎలా?"

"చెబుతాను. నీవు మా ఇద్దరికీ పదేపదే ఏకాంతం కల్పించడం చూసి నాకు అనుమాన మొచ్చింది. చూచాయగా విషయం ఊహించాను. రమ్య గెలవాలనే అలా ప్రవర్తించాను. ఎందుకో తెలుసా? నీవు గెలుస్తున్నకొద్దీ రమ్య తన ప్రయత్నాలు మరింత అధికం చేస్తుంది. అవి ఎక్కడికైనా దారితీయవచ్చు. అందుకే ఆమెని గెలిపించి మన కాపురాన్ని కాపాడాను.

నా ప్రేమలోని నిజాయితీని పరీక్షించడానికి మీరు ఎన్నుకున్న పద్ధతి మంచిది కాదు. నాలా ఆలోచించేవాడు కాకుండా మరెవరైనా నా స్థానంలో ఉండిఉంటే రమ్య జీవితం ఏమయ్యేది?

నా దృష్టిలో ప్రపంచంలోకెల్లా అందమైన ఆడదానివి నువ్వే! ఏ అమ్మాయి కనిపించినా 'ఈమె సింధు అంత అందగత్తె కాదు' అనుకుంటాను. ఒకవేళ నిజంగా నీకంటే అందగత్తె కనిపించినా- 'సింధుకున్న మంచితనం ఈ అమ్మాయికి ఎక్కడుంటుంది?' అనుకుంటాను. అలా అనుకుంటాను కనుకే నీతో సంతోషంగా, తృప్తిగా ఉన్నాను. రెండురోజులు ఉండిపోయే రమ్య కోసం- జీవితాంతం నాకు తోడుగా ఉండే నిన్ను వదులుకోగలనా చెప్పు? నీవు రమ్యతో వాదనలోనే ఓడావు... జీవితంలో ఓడిపోలేదు. ఓడిపోవు కూడా! నా ప్రవర్తన వల్ల నీవు సిగ్గుపడే రోజు ఎన్నటికీ రానివ్వను... ప్రామిస్!" అన్నాడు.

"నన్ను క్షమించండి! మిమ్మల్ని పరీక్షించడం నా తప్పు. అదీ స్నేహితురాలి ద్వారా ఆ పని చేయడం మరో తప్పు!" అతనికి చేరువవుతూ మనస్ఫూర్తిగా అంది సింధు.